కథ

గోపీకృష్ణ పుట్టగంటి

# ప్రాణం ఖరీదు

రకరకాల వాహనాలతో క్రాస్‌రోడ్ రద్దీగా ఉంది. సిగ్నల్ లైట్ ఎరుపురంగుకి మారింది. వాహనాలన్నీ వేగాన్ని తగ్గించుకుంటున్నాయ్.

ఒక ఎరుపురంగు 'ఇన్నోవా' కారు మాత్రం ఏ మాత్రం వేగం తగ్గించకుండా అడ్డంగా వున్న రెండు మూడు చిన్న కారుల్ని రాసుకుంటూ ముందుకెళ్ళి, రోడ్డుమీద అడ్డంగా వస్తున్న ట్రాఫిక్‌ని పట్టించుకోకుండా, వాటి మధ్యనుంచి ముందుకు దూసుకెళ్ళింది.

'ఇన్నోవా' తగిలిన కార్లు అడ్డదిడ్డంగా మెలికలు తిరిగి ఆగాయి. 'ఇన్నోవా'ని వెంబడిస్తున్న పోలీసు జీపులు గుండ్రంగా తిరిగి ఆగబోతున్న కారుల్ని మరొకసారి గుద్ది అవి కూడా ట్రాఫిక్ దాటబోయాయి.

హఠాత్తుగా సిగ్నల్‌కి వ్యతిరేకంగా దూసుకు వచ్చిన ఈ వాహనాల దెబ్బకి ట్రాఫిక్ ఒక్కసారిగా కకావికలమయింది. సడన్ బ్రేక్‌తో ఆగిన వాహనాల్ని, వెనుక నుంచి వచ్చిన వాహనాలు గుద్దుకుని ఆగుతున్నాయి. 'ఇన్నోవా' మాత్రం డ్రైవింగ్ నైపుణ్యం చూపిస్తూ ట్రాఫిక్ దాటగలిగింది. వెంబడిస్తున్న పోలీసు జీపులు, ట్రాఫిక్‌ని తప్పించ లేక చాలా వాహనాల్ని గుద్దేసాయి.

ఈ గందరగోళంలో ఒక పోలీసు జీపు క్రాస్‌రోడ్ మధ్యలో నుంచున్న కానిస్టేబుల్ మీదకి దూసుకు వచ్చింది. అతివేగంతో తనమీదకి దూసుకు వస్తున్న జీపుని చూసి, ఎగిరి పక్కకి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు ఆ పోలీసు కానిస్టేబుల్. జీపుకంట్రోలు తప్పి, అటు యిటు మెలికలు తిరిగి, నాలుగురోడ్ల మధ్యలో నిలబెట్టి ఉన్న ట్రాఫిక్ పోస్ట్‌ని ముక్కలు ముక్కలు చేస్తూ, రోడ్డుకి పక్కకి వెళ్ళి పల్టీకొట్టి ఆగింది.

"కట్..కట్.." మెగాఫోన్‌లో కేక వినపడగానే ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోయాయి.

పల్టీకొట్టి ఆగిన జీపువైపు ఇద్దరు ముగ్గురు సేఫ్టీ అసిస్టెంట్స్ పరుగెత్తుకుంటూ వెళ్ళారు. ఈలోపే దాంట్లో నుంచి డ్రైవరు తలుపు తీసుకుని దిగాడు.

స్టంట్ మాస్టర్ నరసింహం ఒకసారి అందరు డ్రైవర్లూ క్షేమంగా ఉన్నారని రూఢి చేసుకున్నాక, దూరంగా కెమెరా వెనుక గొడుగు కింద కూర్చున్న డైరెక్టరు వైపు నడిచాడు.

డైరెక్టర్ మహేష్ తెలుగు ఇండస్ట్రీలో బాగా డిమాండ్ ఉన్న దర్శకుల్లో ఒకడు. తీసింది నాలుగు సినిమాలే అయినా దాదాపు అన్నీ విజయవంతమవటంతో, మంచి వూపుమీద ఉన్నాడు. అతని సినిమాలన్నీ టేకింగ్ పరంగా వైరైటీగా ఉంటాయని పేరు. సాంకేతిక నైపుణ్యాన్ని ఎంతవరకూ ఉపయోగించుకోవాలో అతన్ని చూసి నేర్చుకోవాలని అనుకుంటూ ఉంటారు. యువతలో క్రేజ్ సంపాదించిన మహేష్ సహజంగానే పెద్దహీరో, హీరోయిన్లకి ఫేవరేట్‌గా మారాడు.

"మనం ఎంత ఖర్చు పెట్టాం అన్నది కాదు ముఖ్యం. దాన్ని ఎంత బాగా తెరమీద చూపించామన్నదే ముఖ్యం. ఇంత గ్రాండ్ రోడ్డు, ఇన్ని వెహికిల్స్ ప్రేక్షకుడు గుర్తించే లోపే, కెమెరా ఫాస్ట్‌గా క్లోజప్ లోకి వెళ్ళిపోయింది" అసంతృప్తిగా అంటున్నాడు మహేష్. కెమెరామెన్‌తో, అప్పటివరకు తీసిన షాట్ మానిటర్‌లో చూస్తూ!

"కొంచెం ఫాస్ట్‌గా కెమెరా మూవ్ అయిన మాట వాస్తవమే సార్, లేకపోతే ఇంత మంచి ఏక్షన్ షాట్, లాంగ్ షాట్ అయిపోయేది. వేరే కెమెరాలో ఎలా వచ్చిందో చూద్దాం"

"ఒక పని చెయ్యండి. నెక్స్ట్ షాట్ రెడీ అయ్యేలోపు నార్మల్ ట్రాఫిక్ మూవ్‌మెంట్స్‌ని కాప్చర్ చెయ్యండి. దాన్ని ఈ షాట్ ముందు కలుపుదాం! సరిపోతుంది"



'అందుకే ఇంత చిన్న వయసులో అంత పెద్ద డైరెక్టర్ అయ్యాడు' అనుకున్నాడు కెమెరామెన్. ప్రతీ విషయం సూక్ష్మంగా ప్రేక్షకుల దృష్టితో పరిశీలిస్తాడు మహేష్. అందరినీ కలుపుకునిపోతాడని పేరున్నా, తను అనుకున్న ఎఫెక్ట్ వచ్చేవరకు కాంప్రమైజ్ కాదనీ, బడ్జెట్ గురించి పట్టించుకోడనీ అంతే అపఖ్యాతి ఉంది. కాకపోతే అతనికి ఆ మాట చెప్పగలిగే ధైర్యం మాత్రం ఎవరికీ లేదు.

అంతలోనే ఏదో ఆలోచన వచ్చినట్లుంది. అసిస్టెంట్ డైరక్టరుని పిలిచాడు. "ఇందాక షాట్‌లో కానిస్టేబుల్ పక్కకి దూకాడు కదా! మొహమంతా దుమ్ము కొట్టుకుపోయి, షాక్ తగిలినట్లు ఫేస్ పెట్టిన కానిస్టేబుల్ని ఒక క్లోజ్ అప్ తియ్యండి. చిన్న పిల్లలు ఎంజాయ్ చేస్తారు"

“అలాగే సార్..ఏమనుకోకపోతే ఒక సలహా..ఆ షాట్ తరువాత, అతని పక్కన వేగంగా వెళ్తున్న వెహికిల్ టైరు బురదగుంటలో పడినట్లు, చిందిన బురద అతని మొహంమీద పడినట్లు చూపిద్దాం సార్!”

“చెప్పినవరకూ చెయ్యవయ్యా” విసుగ్గా అన్నాడు మహేష్.

అంత ట్రాఫిక్ జామ్‌లో వెహికిల్ వేగంగా ఎలా వెళ్తుందో, అంత సోఫిస్టికేటెడ్‌గా కనిపిస్తున్న రోడ్డుమధ్య బురదగుంట ఎలా ఉంటుందో, అనే ఆలోచన కూడా లేనివారు అసిస్టెంట్ డైరెక్టరులవుతున్నారు అనుకున్నాడు.

తనవైపు వస్తున్న నరసింహాన్ని చూసి “తరువాత షాట్ ఏం ప్లాన్ చేసారు?” అని అడిగాడు.

“ఇదే ముఖ్యమయిన షాట్ సార్. జీబ్రా క్రాసింగ్ దగ్గర చాలామంది రోడ్డు దాటుతుంటారు. ఒక పక్క హీరోయిన్‌గారు తన కుక్కతో రోడ్డు దాటుతుంటారు. మరొకవేపు ఒక ఏడెనిమిదేళ్ళ స్టూడెంట్, చూపులేని ముసలి వ్యక్తిని రోడ్డు దాటిస్తుంటుంది”

“కుక్క అనవమాకయ్యా..హీరోయిన్‌కి కోపమొస్తుంది. అందులో అది హీరోయిన్‌గారి ఫేవరెట్ ‘గోల్డెన్ రిట్రీవర్.’ దాని పేరు స్వీటీ అనుకుంటా. అది ఆవిడ సొంత కుక్కయ్యా బాబూ..”

“అలాగే సార్. షాట్‌లోకి వెళ్తే వేగంగా వచ్చిన హీరోగారి ఇన్నోవాకి స్టూడెంట్, ముసలివ్యక్తి అడ్డువస్తారు. వాళ్ళని తప్పిస్తూ ఇంకొక వేపు వెళ్దామంటే హీరోయిన్‌గారు స్వీటీతో వస్తుంటారు. అందుకని హీరో కారుకి సడన్‌బ్రేక్ వెయ్యటంతో కారు రెండు రౌండులు తిరిగి, హీరోయిన్‌ని అనుకుంటూ ఆగిపోతుంది. ఇంతలో వెనకనుంచి వచ్చిన పోలీసులు హీరోని పట్టుకుంటారు..”

“కట్ చేస్తే, తన స్వీటీకోసం పోలీసులకి దొరికిపోయిన హీరోతో, హీరోయిన్‌కి డ్రీమ్‌సాంగ్. అన్నట్లు స్వీటీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయా? అసిస్టెంట్ మేనేజర్ రమణ ఏడి? అతన్ని ఆ రెగ్యులేషన్స్ అన్నీ కంప్లీట్ చెయ్యమని చెప్పాను. వచ్చాడా?”

“స్వీటీ రెడీగా ఉంది సార్. డాక్టర్ కూడా వచ్చాడు. హెల్త్ సర్టిఫికెట్ తీసుకున్నాను” స్వీటీని దువ్వుతూ చెప్పాడు రమణ.

‘వీడు స్వీటీని పట్టుకుని, హీరోయిన్‌ని పట్టుకున్నట్లు ఫీల్ అయిపోతున్నాడు’ అనుకున్నాడు నరసింహం.

జంతువుల్తో షూటింగ్ చెయ్యాలంటే తల ప్రాణం తోకకొస్తుంది. అందుకే ఈ మధ్య సినిమాలలో జంతువులని చూపించటం పూర్తిగా తగ్గిపోయింది. ఒక కుక్కని షూటింగ్‌కి వాడాలంటే, ముందు చెన్నయ్‌లోని ఏనిమల్ వెల్‌ఫేర్ ఆఫీసునుంచి దాని ఆరోగ్యం బాగా ఉందని క్లియరెన్స్ తీసుకోవాలి. తరువాత షూటింగ్ రోజు డాక్టరు వచ్చి, క్లియరెన్స్ తీసుకున్న కుక్క, ఇప్పుడు ఉపయోగిస్తున్న కుక్కా ఒకటేననీ, షూటింగ్‌లో పాల్గొనటానికి పూర్తి ఆరోగ్యంతో ఉందనీ సర్టిఫై చేస్తే కానీ, షూటింగ్ కొనసాగదు. ఈ బాధలన్నీ పడలేక చాలామంది జంతువుల బదులు ఏనిమేషన్ ఫిగర్స్‌ని వాడుతున్నారు.

“చిన్నపాప స్కూల్ డ్రస్‌లో ఉండాలి. ముసలివ్యక్తి చేతిలో కర్ర, కళ్ళకి నల్లకళ్ళద్దాలూ ఉండాలి. లేకపోతే స్ప్లిట్ సెకండ్ కనపడే షాట్ ప్రేక్షకుడి దృష్టిలో రిజిష్టరు కాదు” వివరించాడు మహేష్.

“మొన్న మీరు చెప్పారు కదా..అంతా దాని ప్రకారమే చేసాము” చెప్పాడు నరసింహం.

“కారు ఎవరు డ్రైవ్ చేస్తున్నారు? ఇది చాలా ముఖ్యమయిన షాట్ కదా..హీరోయిన్, స్వీటీ కూడా షాట్‌లో ఉంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కొంపలంటుకుపోతాయి”

“కారు నేనే డ్రైవ్ చేస్తాను సార్..”

“మీరు డ్రైవ్ చేస్తే ఇక ఆలోచించనక్కరలేదు. కానీ ఇంకొకసారి చెప్తున్నాను. హీరోయిన్, స్వీటీ జాగ్రత్త. తేడా వచ్చిందంటే షెడ్యూల్ మొత్తం అప్‌సెట్ అవుతుంది”

“నో ప్రాబ్లమ్ సార్”

రెండు గంటలు పట్టింది తరువాత షాట్‌కి రడీ అయేటప్పటికి. నల్లకళ్ళజోడు పెట్టుకున్న ముసలివ్యక్తిని చూసి నుదురు చిట్లించాడు



## గడుసుపిల్ల కాజల్

ఇటు తెలుగు, అటు తమిళంలో బిజీ బిజీగా వున్న యువ తార కాజల్ అగర్వాల్‌ని మీరెప్పుడైనా ఎవర్నయినా ప్రేమించారా? అని అడిగితే- ఏమాత్రం తడబడకుండా- ‘అవును, ప్రేమించానండీ’ అంటూ చెబుతుంది. నిజమా అని మనం ఆశ్చర్యపోయేసరికి- ‘నేను తొమ్మిదో క్లాసు చదివేటప్పుడు ఓ కుర్రాడ్ని తెగ ప్రేమించాను. కానీ ఆ తర్వాత ఆ అబ్బాయి ఎక్కడికెళ్లాడో ఏమైపోయాడో మాత్రం నాకు తెలీదు’ అంటూ సినిమాటిక్ లుక్ వేస్తుంది. ఎంతయినా కాజల్ గడుసుదే కదా!




మహేష్.

"ఏదయ్యా. నరసింహాన్ని ఒకసారి పిలవండి"

పరుగెత్తుకుంటూ వచ్చాడు నరసింహం.

"ఏంటయ్యా నరసింహం, ముసలివ్యక్తి కావాలని చెప్తే మరీ ఇంత ముసలతన్ని పట్టుకొచ్చావు. షాట్ అయ్యేవరకు అయినా నిలబడగలడా?"

"పర్లేదు సార్. మా మనిషే...అతనికి అలవాటే.."

"సరే కానియ్యండి. ఇంకా ఆలస్యమెందుకు.."

వేగంగా వస్తున్న ఇన్నోవాని, వెనుక తరుముకొస్తున్న పోలీసుజీపుల్ని వేరే వేరే ఏంగిల్స్‌లో రెండు, మూడు షాట్‌లు తీసారు.

నరసింహానికి స్టంట్‌మెన్‌గా మంచి పేరుంది. కేవలం హీరోల గురించే కాకుండా, తన వద్ద పనిచేసే అందరి క్షేమం ఆలోచించే మనిషంటారు. అన్నీ మరొకసారి సరి చూసుకున్నాక కానీ మొదలుపెట్టలేదు. అందుకే అతని కంపోజిషన్‌లో ఏక్సిడెంట్లు చాలా తక్కువ జరుగుతాయని పేరు.

నిన్నంతా అదే రోడ్డుమీద ప్రాక్టీసు చేసాడు నరసింహం, కారు బ్రేక్ వెయ్యగానే రెండు రౌండులు కొట్టి ఆగేటట్టు. ఎంత వేగంతో ఎక్కడ స్టార్ట్ అయితే ఎక్కడకొచ్చి ఆగుతుందో ముందు రోజే రిహార్సల్ చేసి వున్నాడు.

డైరెక్టరు స్టార్ట్ చెప్పేటప్పటికి నటిస్తున్న హీరోయిన్, ఎక్స్‌ట్రా యాక్టర్లు ఎక్కడ ఉంటారో అంచనా వేసుకుని దాన్ని బట్టి తను ఎక్కడ నుంచి బయలుదేరాలో మార్కింగ్ చేసుకున్నాడు. అదే డైరెక్టర్‌కి వివరించాడు.

షాట్ స్టార్టయింది.

ఒక పక్క నుంచి హీరోయిన్ స్వీటీని బెల్టు పట్టుకుని నడిపిస్తూ బయలుదేరింది. ఇంకొకవేపు స్టూడెంట్ వేషంలో ఉన్న చిన్నపాప ముసలివ్యక్తిని రోడ్డు దాటిస్తోంది.

సిగ్నల్ అందుకోగానే ఇన్నోవాని స్టార్ట్ చేసాడు నరసింహం.

స్వీటీ 'గోల్డెన్ రిట్రీవర్' బ్రీడ్. బలంగా ఊగుతూ ముందు నడుస్తుంది. దాదాపు అదే హీరోయిన్ని లాక్కెళుతున్నట్లు ఉంది.

హీరోయిన్ సున్నితంగా కేకలు వేస్తోంది. "స్వీటీ స్లో డౌన్...స్లోడౌన్" అని.

ఒక్కసారిగా దూసుకు వస్తున్న కార్ల శబ్దం, దాని చెవులకి చేరినట్లుంది, సహజంగా కలిగే భయంతో, స్వీటీ ఒక్కసారిగా హీరోయిన్ చేతిలోవున్న బెల్ట్‌ని విదిలించుకుని ముందుకు దూకింది.

తన మీదికి దూకుతున్నట్లు వస్తున్న కుక్కని చూసిన చిన్నపాప భయంతో ముసలి వ్యక్తి చెయ్యి వదిలి పక్కకి పరుగెత్తింది.

ఇన్నోవాలో వస్తున్న నరసింహానికి, దూరం నుంచే ఏదో తేడా జరిగిందని అర్థమయింది. స్వీటీ, యూనిఫాంలో ఉన్న పాపా, ముందు అనుకున్న స్థలంలో కాకుండా వేరే వైపులకి కదులుతూ కనిపించారు. హీరోయిన్‌కి ఏమి చెయ్యాలో అర్థం కానట్లు నిలబడిపోయి ఉంది.

ముందు అనుకున్నట్లు ఎడమవైపు తిప్పి సడన్‌బ్రేక్ వేస్తేఇన్నోవా, స్వీటీ మీదకి దూసుకెళ్ళే అవకాశముంది. దానిని తప్పించాలంటే, ఇంకొక పక్కకి తిప్పాల్సి వస్తుంది. అప్పుడు ముసలివ్యక్తికి, చిన్నపాపకి తగిలే అవకాశం ఉంది.

ఏమి చెయ్యాలో నిర్ణయం తీసుకునే లోపు మనసులో డైరెక్టరు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి, "హీరోయిన్, స్వీటీ జాగ్రత్త" అంటూ. అసంకల్పితంగా స్టీరింగ్ కుడి చేతి వైపుతిరిగింది.

☆☆☆


డైరెక్టర్ మహేష్ ఇంటి ఆవరణ హడావుడిగా ఉంది. కన్సీల్డ్ లైటింగ్‌తో లాన్ అందాలు ద్విగుణీకృతమయి కనిపిస్తున్నాయి. సినీ ఇండస్ట్రీలో ప్రముఖులందరూ ఒక చోట చేరారేమో, ఆహ్లాదకరంగా నవ్వులు విరబూస్తున్నాయి.

మహేష్ డైరెక్ట్ చేసిన సినిమా సూపర్‌హిట్ అయి, ఇంతకుముందు వున్న రికార్డులన్నిటినీ బద్దలు కొట్టిన సందర్భంలో ఇస్తున్న పార్టీ ఇది.

రాత్రి పన్నెండు అవుతుంది. నెమ్మది నెమ్మదిగా అతిథులందరూ మహేష్‌ని అభినందిస్తూ శెలవు తీసుకుంటున్నారు. ఆవరణంతా మెల్లిగా ఖాళీ అవుతోంది.

నరసింహం మహేష్‌ని పలకరించటానికి చాలా సేపట్నించి వేచి ఉన్నాడు. అవకాశం చూసుకుని పలకరించాడు.

"కంగ్రాట్స్ సర్..ఇంతకుముందు సినిమాలన్నిటినీ మించిపోయింది మీ సినిమా. రిలీజయి యాభై రోజులవుతున్నా ఇంకా కల



## రిచా ఆశ!

దాదాపు తొమ్మిదేళ్ల క్రితం 'నువ్వే కావాలి' లాంటి బంపర్ హిట్ సినిమాలో నటించిన ముంబాయి భామ రిచా పల్లాడ్ ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో నటించినా తెలుగులో తెరమరుగైపోయింది. కొంత కాలం తమిళ రంగాన కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఇప్పుడు మలయాళంలో కూడా అడుగుపెడుతోంది. మమ్ముట్టికి జంటగా రిచా ఓ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా హిట్టయితే 'మాలీవుడ్'లో అయినా బిజీ అవుతానని ఆశిస్తోంది రిచా. మరి ఆమె కోరిక నెరవేరాలని కోరుకుందాం.

క్షన్లు ఏమాత్రం తగ్గలేదు. నిజంగా చాలా పెద్దహిట్..”

“థాంక్స్ నరసింహం. మీ అందరి సమిష్టి కృషి తప్ప, నా ఒక్కడి గొప్ప అని నేను అనుకోవటం లేదు. ముఖ్యంగా మీరు కంపోజ్ చేసిన ఫైట్ సీక్వెన్సెస్ గురించి అందరూ ఎలా చెప్పుకుంటున్నారో గమనించారా?”

“దాందేముంది సార్. మీరిచ్చిన ఐడియాలే కదా! కొంతమంది డైరక్టర్లయితే యాక్షన్ పార్టంతా మా మీద వదిలేస్తారు. షూటింగుకు కూడా రారు. మీరు పూర్తిగా ఇన్‌వాల్వ్ కాబట్టి రిజల్ట్స్ ఇంత బాగున్నాయి.”

“సరేకానీ..ఆ రోజు షూటింగ్‌లో ఏక్సిడెంట్ జరిగిన పాపకెలా ఉంది?”

“ఆ రోజు ఏక్సిడెంట్‌లో చనిపోయిన ముసలాయనకి, పాప నిజంగా మనవరాలు సార్. వాళ్ళుండేది మా వీధిలోనే. ఆ పాప అమ్మా, నాన్న దాని చిన్నప్పుడే ట్రైన్ ఏక్సిడెంట్‌లో చనిపోయారు. సరిగా రోజులు గడవక బాధపడుతుంటే..అప్పుడప్పుడూ నేనే వాళ్ళకి ఇలాంటి చిన్న చిన్న పనులు చెప్పేవాడిని కాస్తయినా సహాయం చేసినట్లు అవుతుందని. ఆ రోజు వాళ్ళని పిలుస్తున్నప్పుడు అనుకోలేదు, అందులో ఇంత రిస్కు వుందని”

“నిజమే..అట్లాంటి సీన్లు ఎన్ని తీసి వుంటారు..ఆ రోజు అలా జరిగిపోయింది”

“ఏం చెయ్యాలో ఆలోచించి తీసుకున్న నిర్ణయం కాదు సార్ ఇది. చివరి నిమిషంలో మీరన్న మాటలు గుర్తుకు వచ్చాయి. నేను కారుని అటు తిప్పకపోతే, డైరెక్టుగా హీరోయిన్ మీదకి వెళ్ళేది సార్. కానీ నేను తీసుకున్న నిర్ణయంవల్ల ఒక చిన్నపిల్ల అవిటిదయిపోయింది. ఒక ముసలి ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఈ సంగతులు గుర్తుకొచ్చినప్పుడల్లా మనసంతా ఎలాగో అయిపోతుంది”

“యాక్సిడెంట్లన్నవి మనకి చెప్పి వచ్చేవి కావు. కాకపోతే ఇప్పుడు మనం ఆ కుటుంబానికి ఇంకేమన్నా చెయ్యగలమా అని చూడాలి”

“ఇంకా ఎవరున్నారు సార్, ఆ కుటుంబంలో..ఆ పిల్లని నేనే పెంచుకుంటున్నాను. నా పరిధిలో ఆ పాపకి ఏ ఇబ్బందీ రాకుండా చూసుకుంటున్నాను”

“నేను రేపు ఇంకొక లక్ష రూపాయలకి చెక్ పంపుతాను. పాప పేరు మీద డిపాజిట్ చెయ్యి. తరువాత ఉపయోగపడుతుంది.”

“మీరు ఒక్కరే ఎంతకని చేస్తారు సార్. ప్రొడ్యూసర్ గారు ఒక లక్ష రూపాయలిచ్చి చేతులు దులుపుకున్నారు. హీరోయిన్‌గారయితే కనీస మానవత్వం కూడా చూపలేదు. సహాయం సంగతి పక్కన పెట్టండి, ఒకసారి ఆ పసిదాన్ని పరామర్శించటానికి కూడా ఒప్పుకోలేదు. అవిటివాళ్ళని చూస్తే అసహ్యమట. ఆ పాప ఆ రోజు షూటింగ్‌కి వచ్చింది మేడమ్‌గారిని చూడటానికి సార్. ఆ పాపకి మేడమ్‌గారంటే పిచ్చి అభిమానం సార్” చెప్తుంటే గొంతు బొంగురుపోయింది నరసింహానికి.

“ఊరుకో...అందరూ ఒకలాగా ఉండరు కదా! మనమేమి చెయ్యగలమో ఆలోచించు. కలిసిరాని వారి గురించి ఆలోచించి ఉపయోగమేముంది?”

“లేదు సార్. నా బాధ అది కాదు. పాపకి పోయిన అవయవాన్ని ఎవరూ తెచ్చి ఇవ్వలేరు. కాస్త ఓదార్పు ఇవ్వలేరా? కనీసం ఒక కుక్కకిచ్చిన విలువ కూడా మనిషికివ్వటం లేదే అని తప్ప, ఆ పాపకి ఇప్పుడు తక్కువేమీ కాలేదు. మీరిచ్చిన డబ్బు వుంది, మా అందరి సహకారంతో త్వరలోనే కోలుకుంటుంది”

మహేష్ ఒకసారి సాలోచనగా చూసాడు.

లాన్‌లో సామాను సర్దుతున్న పనివారు తప్ప అందరూ వెళ్ళిపోయారు. అప్పటివరకూ హోరెత్తిన ఆవరణ అలా మూగపోవటంతో, ఆ నిశ్శబ్దం గగుర్పాటు కలిగిస్తోంది.

“నీకొక విషయం చెప్తాను నరసింహం. ప్రాణం విలువ తెలిసినవారికి అది కుక్క ప్రాణమయినా, మనిషి ప్రాణమయినా ఒకటే. సాటిమనిషిని గౌరవించలేనివారికి, కుక్కని ప్రేమించే సంస్కారం మాత్రం వుంటుందని ఎలా అనుకున్నావ్? ఒక కారు, ఒక బంగళా, ఒక నెక్లెస్ ఎంతో ఆ కుక్క కూడా అంతే!”

ఆలోచిస్తున్నట్లు ఆగాడు మహేష్. ద్వైదీభావం నుంచి తేరుకుని ఆఖరికి చెప్పటానికే నిర్ణయించుకుని కొనసాగించాడు. “ఆ సంఘటన జరిగిన కొన్ని రోజులకి షూటింగ్‌లో హీరోయిన్ గారు మూడీగా ఉండటం చూసి ఏంటని అడిగాను. స్వీటీకి ఒంట్లో బాగుండటం లేదని చెప్పింది. ఏమయిందని అడిగాను. తీసుకెళ్ళి చూపించింది. తన శరీరమే తనకి భారమయినట్లు అశక్తంగా పడివుంది స్వీటీ. నడవలేకపోతోంది. ఆహారం తీసుకోక నీరసించిపోయింది. తెలిసిన డాక్టరు దగ్గరకి మనిషినిచ్చి పంపాను. ఒక వయసు తరువాత కుక్కల్లో వచ్చే ఆర్థరైటిస్ అని తేల్చాడు. దానికి మందు లేదని, అది బతికినన్నాళ్ళూ ఇక అంతేనని చెప్పాడట”

“అయ్యో..ఇప్పుడు ఆ కుక్కకి..అదే స్వీటీకి ఎలా ఉందో?”

చిన్నగా నవ్వాడు మహేష్.

“ఎంత మూర్ఖుడివయ్యా నరసింహం? ఈ రోజుల్లో తమ పనులు తాము చేసుకోలేకపోతే సొంత తల్లిదండ్రుల్నే చూడటం లేదు, కుక్కల్ని సంరక్షించేదెవరు? రెండు రోజుల తర్వాత మరలా ఆ డాక్టరు దగ్గరకి స్వీటీని పంపారు. ఈసారి అది తిరిగి రాలేదు. ఒక్క ఇంజెక్షన్‌తో ప్రాబ్లమ్ సాల్వ్ అయిపోయింది. ఆఫ్‌కోర్స్ డాక్టర్ దగ్గరకి పంపే ముందు రకరకాల ఏంగిల్స్‌లో ఫోటోలు తీయించటం మర్చిపోలేదు, పేపర్‌లో వేయించటానికి..”

“......”

“కాబట్టి ఇంకెప్పుడూ ఆ మాట అనకు కుక్కకిచ్చే విలువ కూడా మనిషికివ్వటం లేదని...మనిషిని అలా చంపాలంటే బహుశా ఇంకొంత సమయం పడుతుందనుకుంటా”

☆



## దటీజ్ నయనతార!

కోటి రూపాయల పైబడి పారితోషికాన్ని డిమాండ్ చేయగల నయనతారకి ఒక్కసారిగా రెండు పెద్ద ఫ్లాపులు వచ్చిపడ్డాయి. కుసేలన్ (కథానాయకుడు), సత్యం (సెల్యూట్) సినిమాలు పరాజయాన్ని చవి చూసినా నయనతార డిమాండ్‌లో ఎలాంటి మార్పూ రాలేదనేది చెన్నయ్ సినీ పండితుల ఉవాచ. ఆ సినిమాలు పరాజం పాలు కావడానికి కారణాలు వేరే వున్నాయి కానీ నయనతారకి దాంతో సంబంధం లేదనేది వీరి వాదన. అందుకనే ఇప్పటికీ కోలీవుడ్ (తమిళ సినీ రంగం)లో నయన డిమాండ్‌లో ఎలాంటి మార్పూ రాలేదట. లక్కీ నయనతార!